కథా నిలయం
5052
శ్రీకాకుళం

# ఏం మనుషులు

ఐదుగంటలవటంతోటే ఆఫీసునుంచి బయటికొచ్చి, సీత చేతిలోవున్న సంచి, గొడుగూ సరిజేసుకొని 'పార్క్' స్టేషనుకు బయలుదేరింది. ఆ సమయంలోనే 'రిప్పన్‌బిల్డింగ్స్' టవర్ క్లాక్......... ఎంతో వినసొంపుగా ఐదు గంటల్ని మ్రోగించింది. సీత మొహం నిగారించింది. 'సరీగా ఇదేసమయానికి మధు తన ఆఫీసులో బయలుదేరివుంటాడు...... ఇంటికి!' అని అనుకుంటూ సీత స్టేషన్ ప్లాట్‌ఫారంమీదికొచ్చి ఎలక్ట్రిక్ ట్రెయిన్‌కోసం ఎదురుచూస్తోంది.

జనం... ఆకొసనుంచి ఈకొసదాకా నిలబడివున్నారు. వీళ్ళంతా ఉదయంనుంచి సాయంత్రంవరకు తనలాగా ఏదో ఆఫీసులో పనిచేసి వస్తుంటారు! సాయంత్రం కావటం ఆలస్యం... బస్సుల్లో, ట్రెయిన్సులో... ఎక్కడా ఖాళీ వుండదు! ఒకటే తొందర ఏదో మించిపోతున్నట్టు! రైలు రావటంలేదు! రెండు నిమిషాలకే చికాకుగావుంది. మనస్సు త్వరపెడుతోంది.

అప్పుడు అనుకుంది... వీళ్ళంతా ఎందుకింత...... తొరపడుతున్నదీ! మధురూపు ఆమె స్మృతుల్లో మాటిమాటికీ కదులుతోంది! అతన్ని కలుసుకోవాలని హృదయము ఎంతో తాపత్రయపడుతోంది! 'వీళ్ళంతా ... ఎవరినో కలుసుకునేందుకు... ఎవరితోనో మాట్లాడేందుకు... ఉవ్విళ్ళూరుతున్నారు' అని. తనూ అంతే!

ఎలక్ట్రిక్ ట్రయిన్ పరుగిడుతూవచ్చి... జనాన్ని ఒక నిమిషంలోపలే తనలో యిముడ్చుకొని మరో నిమిషంలో కొండమీదనుంచి జారుతున్న వస్తువులాగా ... గబగబా ముందుకు సాగిపోయింది. సీత మధును గురించే ఆలోచిస్తోంది అలాగే నిల్చొని !

పరిక్క స్టేషనులో ట్రెయిన్ ఆగినప్పుడు చాలామంది దిగారు. ఖాళీఅయిన బెంచీమీద కూచుంది. కొంతమందిని దింపి, మరల క్రొత్తమనుషుల్ని తనలోకి తీసుకొని రైలు సాగింది.

సీతహృదయంలో మరల ఏవో భావనలు కూడుకుంటున్నాయి... 'తన జీవితం ధన్యం !'— ఇదేమాట సీత ప్రతి స్నేహితురాలు పలుకుతుంది. సిత ముచ్చటపడుతుంది. తన జీవితానికి నలువేపులా వెన్నెల విరజిమ్ముకొని వున్నట్లు భావిస్తుంది. నిన్న ఆఫీసులో లలిత అనే అమ్మాయికూడా అన్నది—'మధులాంటి సహృదయుడైనవ్యక్తి నీకు భర్తగా లభించటం నీ అదృష్టం!' అని. 'ఎవరో అన్నంత మాత్రానే నా జీవితం మధురం కాలేదు. నాకు నేనుగా అవలోకించుకుంటేనే తెలుస్తోంది—నాజీవితంలో మధురజగత్తును మధు సృష్టించగలసమర్థుడు!'

ఊహాలదోనెల్లో విహరిస్తుండగానే తను దిగవలసిన స్టేషన్ వచ్చింది. ట్రైన్ దిగేప్పుడు ఎవరో ఎదురుగాకూర్చున్న మనిషి — అదేపనిగా తనవేపు ఎప్పటినుంచో అదోలా

చూస్తున్నాడని గ్రహించింది. 'ఏం మనుషులు !' అని అను కున్నది.

రైలు దిగి మెల్లెక్కబోతూన్న సీత—అప్రయత్నంగా అప్పుడే సాగిన ట్రైన్‌వంక చూచేప్పటికి— రైల్లో అదేపనిగా తనవేపుచూచినవ్యక్తి — ఇటుతిరిగి నవ్వుతూ చెయ్యి ఎగరే స్తున్నాడు- ఇదివరకు సీతనుఎరుగున్నమనిషిలాగా ! అసహ్యం వేసింది. గబగబా మెల్లెక్కి స్టేషన్‌కు అటువేపు వెళ్ళి పోయింది.

ఆలోచిస్తూపోతోంది— 'మధు ఆఫీసునుంచి వచ్చి వుంటాడు ! 'ఉదయం ఆఫీసు కెళ్ళేప్పుడు మెడిసిన్ చదువు తున్న మీా స్నేహితురాలు కన్పించి వచ్చే వారం మనింటికి వస్తానన్న'దని చెబితే— ఎంత సంతోషిస్తాడు ? ఆదివారం నాటికి మాంచి ప్రోగ్రాం నిర్ణయించుకొని వచ్చి వుంటే ! మెరీనాకు వెళ్దామంటే— తల నొప్పేస్తుంది ఎందుకో ! ఆది వారమల్లా మినర్వాలోనో రాక్సీలోనో—ఎక్కడో సినిమా లతో గడిపేయాల్సిందే ! నాకూ అదే అలవాటయింది—. మళ్ళీ ఇవ్వాళ వాళ్ళ ఆఫీసుమేనేజరు ఏమడిగాడో నన్ను గురించి ? 'నీ భార్య బి. ఏ. చదివిందా ? ఫరవాలేదే ?' అన్నాట్ట ఒకరోజున. 'ఏం నీ భార్య బి. ఏ. చదివిందా ?' అంటే చదవగూడదుగాబోలు ? మగవాళ్ళైనా బియేలు చదివేది? మరో రోజు మర్యాదగా పిలిచి 'నీ భార్య ఉద్యోగం చేయటం నీకిష్టమేనా ?' అని అడిగాట్ట ! ఎందుకో ఆయన కీ ధర్మసందేహం ? భార్యఅంటే 'పిల్లల్నికనే యంత్రం' అనే

ఆయ నింకా భావిస్తున్నాడేమో — ఈ రోజుల్లోగూడా మగవాళ్ళ మనసుల్లో అంకితమైన భావాల్ని తీసేయటం చాలా కష్టం! ఎక్కడైనా బహిరంగంగా చెప్పాల్సివస్తే స్త్రీ సమస్యల్నిగూర్చి చాలా ఉదాత్తతను ప్రదర్శిస్తారు!

'నీకు తెలీదు సీతా! మా మేనేజరు చాలామంచివాడు' అని మధు చెప్పాడు. ఆయనలోవున్న మంచి మధుకే తెలియాలి!' అని సరిపెట్టుకుంది - సీత.

తాను ఇంటిని సమీపిస్తున్నకొద్దీ — హృదయంలో ఆనందాతిరేకా లుత్పన్నమవుతున్నాయి.! ఇంట్లో అడుగు పెట్టటంతోటే —మధు ఏవో కబుర్లు చెప్పుకుపోతాడు!— ఇవ్వాళ మరల వాళ్ళ మేనేజరు ఏమైనా అన్నాడేమో! బహుశా ఇవ్వాళ—."ఏమయ్యా, మధుసూధనరావ్! నువ్వీ ఆఫీసులో నూటపేభై సంపాయిస్తున్నావు! నీ భార్య మరోవేపునుంచి నూటపభై దాకా సంపాయిస్తోంది — డబ్బంతా ఏం జేస్తున్నారు?' అని అడిగివుంటాడు! మధు ఏమి సమాధానం చెప్పివుంటాడో? 'బ్యాంక్ ఎకౌంట్' వుందని చెబుతాడు! అప్పుడు ఆయన 'అయితే! పుట్టబోయే పిల్లలకు నిలవజేస్తున్నారన్నమాట!' అని అనివుంటాడేమో? —పిల్లలు! చాలా సంవత్సరాలనుంచి చాలామంది—. యంత్రాల్లాగా పిల్లల్ని కంటూనేవచ్చారు! ఇంకా యీ పద్ధతి కొనసాగాల్సిందేనా? ఈ విషయంలో మధును మెచ్చుకోవాల్సిందే! నేటి సామాజికవ్యవస్థలో ఆడవాళ్ళకుకూడా

ఆర్థికస్వాతంత్ర్యం కావాలంటాడు. ఎంతకాలమని పాతగాడి లోనే ప్రయాణం చెయ్యటం ?

తలుపులు తెరచి వున్నాయి. గబగబా లోనికివెళ్ళి చూచేప్పటికి...మధు అన్యమనస్కుడై కుర్చీలో కూచోని ......కనీసం తను రావటమైనా కనిపెట్టి ఇటుచూడక, కిటికీ లోనుంచి బయటికి చూస్తున్నాడు. సీత బాధపడింది. సంచీ గొడుగూ అవతల పడేసి మధుకు దగ్గరగావెళ్ళి అడిగింది— 'ఏమిటి? ఇలావున్నావ్?'

మధు సీతవేపు తిరక్కుండానే చెప్పాడు—'నేను ఉద్యోగం వదిలేశాను సీతా!' 'ఏంటిమధూ? ఏమిటి నువ్వనేది? నాకేమీ అర్థం కావటంలేదు! ఉద్యోగ మెందుకూ వదిలేయ టం?' మధు వెంటనే సమాధానం చెప్పలేదు. సీతబాధపడింది. ఆమె చుట్టూరా...ఏవో లక్ష ప్రశ్నలు నిలుచున్నాయి! 'భార్యా భర్త లిద్దరూ ఉద్యోగం చేయటం ఎంత చక్కగా వున్నది!' అని ఎంతోమంది తనను ప్రశంసించారు! తను గడుపుతున్న జీవితాన్ని చూచి మెచ్చుకున్నారు! 'వాళ్ళంతా ఈసడించుకుంటారు...' ఈ విషయం విని సీత పరిపరివిధాల ఆలోచించి...బాధపడి ఆ బాధను లోలోపల అణచుకొని అడిగింది— 'ఏమిటి మధూ! ఉద్యోగం వదిలేయటం దేనికి?' మధు ఇటువేపుకు తిరిగాడు...మొహం మొద్దుబారిపోయి వుంది! ఏదో ఆవేశం అతని యావత్తు శరీరాన్ని బద్దలు జేసు కొని బయటికి రావాలని చూస్తోంది...

'ఆ రాస్కెల్ లేడూ! మా మేనేజరు వట్టి వెధవాయ్!

సీత కర్థంకాలేదు. ఒకరోజు అన్నాడు 'మా మేనేజరు చాలామంచివాడు సీతా!' అని. మరల ఈరోజున 'అతను 'రాస్కెల్! వట్టి వెధవాయ్'ట. ఏమిటో అంతవిచిత్రం!

'వాణ్ని చూస్తుండగానే పీకె నులిమేయాలనిపించింది. దుర్మార్గుడు! ఇవ్వాళకూడా రోజుటిలాగా ఆ మాటా ఈ మాటా మాట్లాడి- ఆఖరున అన్నాడు 'భార్యా నువ్వూకూడా ఆఫీసుకు ఉదయంవచ్చి సాయంత్రానికి తిరిగివెళ్తారుగదా— మరి భోజనం ఏర్పాటు ఎలాగు...హోటల్ భోజనంకూడా భోజనమేనా? సరేగాని, మీ ఉభయులూ ప్రేమించి పెళ్ళి జేసుకున్నారాఏమిటి? రిజిష్టరు మేరేజా లేక కాంట్రాక్టు మేరేజా! నీ భార్య చాలా అందంగా వుంటుందటగా? నిజమేనా?' ఈ మాటలు విని వినటంతోనే నాబల్లమీదున్న లావాంటి ఫైలు తీసుకొని...మొహానికేసి కొట్టాను.

'రాజీనామాపత్రాన్నికూడా వాడి మొహంమీద పడేసి చక్కావచ్చాను...మధ్యాహ్నానికే!'

సీత హృదయం ఒక్కమారుగా దహించుకుపోయింది ఆపాదమస్తకం అదిరిపోయింది.

'ఆఫీసు వ్యవహారాలతోనే అతనికి సంబంధంగాని... ఇలా నీ వ్యక్తిగత విషయాల్లోకి ప్రవేశించటానికి అతని కేం అధికారం వుంది?'

'వాడు వట్టి నీచుడు'

'దీనికి కారకుడవు నీవే! ఇదివరకల్లా అతను అడిగినదాని కల్లా నవ్వుతూ సమాధానం ఇచ్చేవు! అతన్ని ప్రశంసించావు! పర్యవసానంగా ఈనాడు అత నిలా ప్రవర్తించాడు!

'అయితే తప్పు నాదేనంటావు? నన్నొక నీచుడుగా భావిస్తానంటావు! ఇదేగా నీఅభిమతం? ఇతరులచేత నే నలాంటి మాటలన్నీ విని సహించటం నీకిష్టమేనస తోస్తున్నదే!

'ఎందుకలా ఉద్రేకపడతావ్? ఇలా జరగటం నాకిష్టమే నని నేను చెప్పటం లేదు. అలా అనేందుకు కావలసిన అవకాశాన్ని నువ్వు కల్పించావనే నే నంటున్నాను. పైగా జీవితంలో మనం కొన్ని విషయాల్లో పరిస్థితులకు పూనుకోకూడదు. నైతిక విలువల విషయంలో—మరీను!

'నీకు తెలీదు—ఉదయం లేచిన దగ్గర్నుంచి సాయంత్రం ఆఫీసునుంచి వచ్చేంతవరకు నాముందు ఎన్నో విషయాలు జరిగిపోతాయి.

'రైలుస్టేషన్ ప్లాట్‌ఫారంమీదా, ప్రయాణం చేసేప్పుడు ట్రయిన్‌లోను ఎందరో నావేపుచూచి పూర్వపరిచయం వున్నట్లే నవ్వుతారు. ఇలాంటి విషయాలు సామాన్యం కావాలంటే మొదట్లో కొంత నిస్తబ్ధత, సందు జాగ్రత్త ఎంతైనా అవసరం'

మధు కుర్చీలోనుంచి లేచి వాకిట్లో నిలబడ్డాడు. సీత అతని వెనుక నించొనివుంది. ఉద్రేకంగానే మధు అన్నాడు—'నువ్వేదో పైతరహాకు చెందినవ్యక్తివలె నాకు నువ్వు నీతులు బోధించ నవసరం లేదు. నీలాగా నేను వ్యక్తుల మానావ

మానాల్ని సహించలేను' అని అంటూనే మధు బయటికి వెళ్ళిపోయాడు. సీత అలాగే చూస్తూ వుండిపోయింది.

♦ ♦ ♦ ♦ ♦ ♦

హోటల్‌నుంచి కుర్రాడు టిఫిన్ క్యారియర్ తెచ్చి లోపల పెట్టి వెళ్ళిపోయాడు. సీత భోంచేయలేదు. తొమ్మిది గంటలు దాటిపోయింది. మధు తిరిగి రాలేదు.

'రేపు ఉదయానికల్లా నాజీవితం అపహాస్యంపాలవుతుంది. 'నీజీవితం బాగా వుందని' ప్రశంసించినవాళ్ళు 'నీజీవితం భగ్నమైంది' అని సానుభూతిని ప్రకటిస్తారు. 'మీగృహస్థ జీవితం స్వర్గతుల్యం' అని నిన్నటిరోజున పలికిన లలిత మాటకు ఈరోజున అర్థంలేదు.

ఇలాంటివెన్నో ఆలోచనలు ఆమెహృదయపు కడలిలో కల్లోలాన్ని, ఘోషను రేపినాయి.

'మధు నన్ను అర్థం చేసుకోటంలో పొరబడుతున్నాడేమో? నేను ఉద్యోగం చేయటం అతని కిష్టంలేదేమో?'— ఈ భావాలు సీత హృదయంలో రేగటంతో ఆమె మొహంలో విషాదచ్ఛాయలు— కారు మేఘాల్లాగా అలుముకున్నాయి. నరాల్లోని ఆవేదన బుసలుకొట్టింది. తనలోని ఆశయాలకు సంబంధించిన స్మృతులు పడగలెత్తి పురోగమించమని ఆదేశించినాయి.

♦ ♦ ♦ ♦ ♦ ♦

మధు మరల తిరిగిరానేలేదు. యథాతథంగా సీత తన ఉద్యోగాన్ని నిర్వర్తించుకుపోతూనేవుంది.